సాక్షి ఖమ్మం

గురువారం । 2 । జనవరి । 2025



పునర్వైభవం సాధించేనా?

జిల్లా పెద్దాస్పత్రిలో 2023తో పోలిస్తే 2024లో వైద్యసేవలు తగ్గగా.. కొత్త ఏడాదైనా పరిస్థితిలో మార్పు వస్తుందా అన్న సంశయం నెలకొంది. 8లో



ముగిసిన ఆర్చరీ పోటీలు

రెండు రోజులుగా ఖమ్మం పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఆర్చరీ పోటీలు బుధవారం ముగిశాయి. 8లో

గరిష్ఠం / కనిష్ఠం

31° / 15°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగే అవకాశముంది. రాత్రి మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం సాయంత్రం ఖమ్మం చేరుకోనున్న ఆయన ఇక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించనున్న మంత్రి, 10గంటలకు పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్‌లో యానంబైలు – జిన్నగట్టు మధ్య హైలెవెల్ బ్రిడ్జి, పాండురంగాపురంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశాక లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర కళాశాలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రైఫిల్ షూటింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. ఆతర్వాత లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలోని బెటాలియన్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాక కొత్తగూడెంలో కమ్యూనిటీ హాల్, రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు వెడల్పు పనులను ప్రారంభించి ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఇందిరా మహిళా శక్తి ఫుడ్‌కోర్టును మంత్రి సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 3.45 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షించనున్నారు. ఆతర్వాత ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెం, చింతపల్లి క్రాస్ వద్ద రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

నేటి నుంచి టెట్

ఖమ్మం సహకారనగర్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు(టీజీటీఈటీ) పరీక్ష ఈనెల 2నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగనుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లా అభ్యర్థుల కోసం ఖమ్మం జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో హాజరుకావాలని డీఈఓ సోమశేఖర శర్మ సూచించారు. కాగా, ఖమ్మం, రూరల్ మండలాల్లోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, సత్తుపల్లిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల, మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలతో పాటు కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన విజయ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ప్రారంభమైన రోడ్డు భద్రతా మాసోత్సవాలు



రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న రవాణా శాఖాధికారులు

ఖమ్మంక్రైం: రవాణాశాఖ ఆధ్వర్యాన రోడ్డు భద్రతా మాసోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఆర్‌టీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రాణం కంటే విలువైనదేదీ లేదని వాహనదారులు గుర్తించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదాల బారిన పడితే కుటుంబాలకు తీరని నష్టం ఎదురవుతుందని చెప్పారు. ఈసందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్లు, సీట్ బెల్ట్ ఆవశ్యకతపై వాహనదారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంవీఐ రెంటాల స్వర్ణలత, ఏఓ జావెద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్య డీడీగా శ్రీనివాసరెడ్డి?

ఖమ్మం సహకారనగర్: వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా శ్రీనివాసరెడ్డిని నియమితులైనట్లు తెలిసింది. జిల్లాలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో డీడీగా విధులు నిర్వర్తించిన జయశంకర్ గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆదిలాబాద్ వయోజన విద్య డీడీగా ఉన్న శ్రీనివాసరెడ్డిని ఖమ్మంకు కేటాయించినట్లు సమాచారం. ఆయన ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

నామినేటెడ్ పదవుల పందేరం

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం నుంచి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ నేతల ఆశలు నెరవేరే సమయం ఆసన్నమైనట్లు తెలుస్తోంది. ఖమ్మం నియోజకవర్గంలో కీలక పదవులైన ఖమ్మం మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ చైర్మన్ పదవులు రఘునాథపాలెం మండల నాయకులకు దక్కనున్నట్లు సమాచారం. మార్కెట్ చైర్మన్‌గా వీ.వీ.పాలెంకు చెందిన మాజీ ఎంపీటీసీ యరగర్ల హన్మంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్‌గా బూడిదంపాడుకు చెందిన తుమ్మలపల్లి చిన్న వెంకటేశ్వర్లు పేర్లను ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈవిషయమై ఒకటి, రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడుతుందనే ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు, సర్వే వివరాలు

	ఖమ్మం	పాలేరు	మధిర	వైరా	సత్తుపల్లి
వచ్చిన దరఖాస్తులు	70,320	70,918	69,917	68,582	78,132
సర్వే పూర్తయినవి	55,082	63,087	61,874	59,481	66,607

ఆఖిరి దశలో సర్వే..

కొలిక్కి వచ్చిన 'ఇందిరమ్మ' దరఖాస్తుల పరిశీలన

- ఖమ్మం జిల్లాలో 83.96శాతం, భద్రాద్రి జిల్లాలో 70శాతం పూర్తి
- అధికారులతో ఐదు శాతం మేర 'సూపర్ చెకింగ్'
- త్వరలోనే తేలనున్న లబ్ధిదారుల సంఖ్య



యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీ.పీ.గౌతమ్(ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ఉమ్మడి జిల్లాలో ఓ కొలిక్కి వచ్చింది. వారం రోజుల్లో దరఖాస్తుల సర్వే పూర్తవుతుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 83.96 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 70 శాతం మేర సర్వే పూర్తికాగా, ఎంపీడీఓలు సూపర్ చెకింగ్ చేస్తున్నారు. ఒక్కో మండలంలో కనీసం ఐదు శాతం దరఖాస్తులను వీరు పరిశీలించి అర్హులను నిర్ధారించనున్నారు.

గతనెల 9నుంచి..

ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే గత నెల 9నుంచి ప్రారంభమైంది. కొన్నాళ్ల క్రితం నిర్వహించిన ప్రజాపాలన సభల్లో ఖమ్మం జిల్లాలో ఇళ్ల కోసం 3,57,869 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 3,06,131 ఇళ్లలో పరిశీలన పూర్తయింది. ఇందులో 3,00,453 దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లోనూ నమోదు చేశారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,73,493 దరఖాస్తులకు గాను 1,90,181 ఇళ్ల సర్వే పూర్తవగా, మరో 83,312 దరఖాస్తులు మిగిలి ఉన్నాయి.

భద్రాద్రిలో కాస్త నెమ్మదిగా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సర్వే కొంత మేర వేగంగా సాగింది. పాలేరు నియోజకవర్గంలో 87.59 శాతం, మధిర నియోజకవర్గంలో 87.10 శాతం, వైరాలో 85.15 శాతం, సత్తుపల్లిలో 84.20 శాతం పూర్తయింది. ఇక ఖమ్మం నియోజకవర్గంలో 75.73 శాతం దరఖాస్తుల పరిశీలన జరగగా, ఇది ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 72.26 శాతంగానే నమోదైంది. అయితే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం 70 శాతం దరఖాస్తుల పరిశీలనే పూర్తవడం గమనార్హం. ఇక్కడ ఇల్లెందు నియోజకవర్గంలో మాత్రం అత్యధికంగా 76 శాతంగా నమోదైంది.

నూరు శాతం కష్టమే..

దరఖాస్తుల ఆధారంగా సర్వే వంద శాతం పూర్తి చేయడం కష్టమేనని ఉద్యోగులు భావిస్తున్నారు. కొన్ని ఇళ్లను వదిలేయడంపై అధికారులు వివరణ కోరగా సిబ్బంది చెప్పిన సమాధానాలతో ఇలా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కొందరు ఒక చోట దరఖాస్తు చేసుకోగా.. వారి స్థలం మరో గ్రామంలో ఉండడం, కొందరు ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు ఇచ్చిన చిరునామాలో ఎవరూ లేకపోవడం, మరికొందరు కన్నుమూయడం, ఇంకొందరు ఫోన్లు తీయడం లేదని సమాచారం. అంతేకాక పలువురు సర్వేకు వచ్చిన సిబ్బందితో తమకు ఇల్లు అవసరం లేదని చెబుతుండగా, చాలా మంది ఇతర గ్రామాల్లో నివసిస్తూ సొంత గ్రామంలో ఇల్లు కావాలని కోరుతున్నట్లు తెలిసింది. ఇలాంటి దరఖాస్తులన్నీ పోను మిగిలిన వాటినే అప్‌లోడ్ చేయనున్నారు.

నాలుగైదు రోజుల్లో పూర్తవుతుంది..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల ఆధారంగా సర్వే నాలుగైదు రోజుల్లో పూర్తవుతుంది. దరఖాస్తుదారులు ఒకచోట, స్థలం ఒక చోట ఉండడం, కొందరి చిరునామాలు దొరకకపోవడం, మరికొందరు ఇల్లు వద్దని చెప్పడం వంటి కారణాలతో కొన్ని దరఖాస్తులు మిగిలిపోతున్నాయి. ఇలాంటివి 14నుంచి 15శాతం మేర ఉండగా దరఖాస్తులపై కారణాలు రాయాలని సిబ్బందికి సూచించాం. సర్వే పూర్తయ్యాక గ్రామపంచాయతీల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో కమిషనర్ ఐదు శాతం మేర సూపర్ చెకింగ్ చేస్తే లబ్ధిదారుల సంఖ్య తేలనుంది.

– బి.శ్రీనివాస్, పీడీ, గృహనిర్మాణశాఖ, ఖమ్మం

మా పేర్లు ఏవీ?

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన సభల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు తమ వద్దకు సర్వే సిబ్బంది ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తున్నారు. కానీ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయాన ఆపరేటర్ల పొరపాట్లతో యాప్‌లో పేర్లు కానరావడం లేదు. ఫలితంగా ఏదైనా వీధికి వెళ్లినప్పుడు పేర్లు లేనివారు సిబ్బందిని ఆరా తీస్తున్నారు. కానీ యాప్‌లో పేర్లు రాలేదని చెబుతుండగా వీరంతా కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల కార్యాలయాలకు వెళ్లి తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇందులో పలువురు మరోమారు దరఖాస్తులు ఇస్తున్నారు.



సర్వేకు ఎప్పుడు వస్తారని కేఎంసీలో ఆరా తీస్తున్న మహిళ (ఫైల్)



కేఎంసీలో యువరక్తం!

- కొత్తగా 46మంది వార్డ్, అకౌంట్ ఆఫీసర్లు
- గ్రూప్–4లో కొలువులతో అభ్యర్థులకు పోస్టింగ్
- అత్యధికులు రైతు కుటుంబాల నుండి వచ్చినవారే
- సిబ్బంది కొరత తీరడంతో పనుల్లో పెరగనున్న వేగం

ఖమ్మంమయూరిసెంటర్: సిబ్బంది లేమితో కొట్టుమిట్టాడుతున్న ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారితో కళకళలాడుతోంది. కొన్నాళ్ల క్రితం గ్రూప్–4 ఉద్యోగాలు పొందిన 43మంది వార్డ్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంటెంట్లు ముగ్గురిని ప్రభుత్వం ఇటీవల కేఎంసీకి కేటాయించింది. దీంతో వీరు విడతల వారీగా విధుల్లో చేరారు. కాగా, వార్డ్ ఆఫీసర్లు సరిపడా లేక ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు, కేఎంసీ కార్యకలాపాల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పుడు కొత్తగా సిబ్బందిని కేటాయించడం, అంతా యువతే కావడంతో పనుల్లో వేగం పెరుగుతుందని భావిస్తున్నారు.

వ్యవసాయ కుటుంబాల నుండే..

గ్రూప్–4లో ఉద్యోగాలు సాధించి కేఎంసీకి కేటాయించిన వారిలో అత్యధికం వ్యవసాయ కుటుంబాల నుండి వచ్చిన వారే కావడం విశేషం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించగా.. వారు ప్రభుత్వ కొలువులు సాధించడంతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. కాగా, ఇందులో కొందరు కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు చేస్తూనే గ్రూప్–4 ఉద్యోగాలు సాధించారు. ఇంకొందరు ఇతర పోటీ పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూస్తూనే ఈ ఉద్యోగాల్లో చేరారు. ఈమేరకు కేఎంసీ చేరిన కొత్త ఉద్యోగులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

మొదటి ప్రయత్నంలోనే..



మా నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో డిగ్రీ పూర్తి చేశాక ఆయన సూచనలతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. ఇలా మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–4 ఉద్యోగం సాధించా. కేఎంసీ వార్డ్ ఆఫీసర్‌గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

– బూర్లుగడ్డ సౌమ్యశ్రీ, ఖమ్మం

ఆనందంగా ఉంది..



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే గ్రూప్–4 పరీక్ష రాయగా ఉద్యోగానికి ఎంపికయ్యా. తద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే నా కల సాకారమైంది. నా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ చదివించగా నేను ఉద్యోగం సాధించడంతో వారు సంతోషిస్తున్నారు.

– నెల్లూరి సింధు, మంద్రాజుపల్లి

ఇది రెండో కొలువు..



అమ్మానాన్న వ్యవసాయం చేస్తుండగా చిన్నతనం నుంచి కష్టపడడం నేర్పించారు. తొలుత నాకు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ఆతర్వాత గ్రూప్–4 రాసి ఈ ఉద్యోగం కూడా సాధించా. ప్రభుత్వ ఉద్యోగం కోసం పట్టుదలతో చదవడంతో ఫలితం దక్కినట్లయింది.

– ఎస్.కే.ఇమ్రాన్, దుద్దిపూడి, వైరా

కష్టపడి చదివించారు..



మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ నన్ను, తమ్ముడిని కష్టపడి చదివించారు. నేను మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–4 ఉద్యోగం సాధించినట్లు తెలియగానే వారి సంతోషానికి అవధులు లేవు. కష్టం విలువ తెలిసిన నేను పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించా.

– టి.సాయికౌశిక్, రంగంబంజర, మధిర

కల నెరవేరింది..



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నా కల. అందుకోసం కష్టపడి సిద్ధమవగా గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికయ్యా. ఇప్పుడు కేఎంసీలో పోస్టింగ్ రావడంతో మా బంధువులే కాక స్నేహితులు, సైతం కష్టానికి తగిన ఫలితం దక్కిందని అభినందిస్తున్నారు.

– గోదా వంశీకృష్ణ, గణేశ్‌పాలెం, వీ.ఎం.బంజర

కూర్మావతారంలో కనువిందుగా..



స్వామి వారిని పల్లకీ సేవగా తీసుకొస్తున్న ఈఓ, ఏఈఓ, ఇతర అధికారులు

- రామాలయంలో రెండో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు
- స్వామివారికి భక్తుల నీరాజనం
- నేడు వరాహావతారంలో దర్శనం

భద్రాచలం : క్షీరాబ్ధి సమయాన మందరగిరిని తన వీపున మోసి దేవతలకు అమృతం అందించిన కూర్మావతారంలో భద్రాద్రి రామయ్య భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశాడు. వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో రెండో రోజైన బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కూర్మావతారంలో అలంకరించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. ఆరాధన, నివేదన అనంతరం వేద పండితులు 200 నాళాయిర దివ్య ప్రబంధాలను పఠించారు. 12 మంది ఆళ్వార్లకు పరివట్టం కట్టి పూల మాలలు వేసి తులసీ దళాలు సమర్పించారు. అనంతరం కూర్మావతారంలో అలంకరించిన స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చారు. ఆంగ్ల సంవత్సరాది కావడంతో రామాలయానికి భక్తులు పోటెత్తారు. దీంతో క్యూలైన్లు, సర్వదర్శనం లైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కూర్మావతారంలో ఉన్న స్వామివారికి భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మిథిలా స్టేడియంలో నీరాజనం..

ప్రత్యేక పల్లకీపై స్వామివారిని వేంచేపు చేసి మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ మాడవీధుల మీదుగా మిథిలా స్టేడియంలోని అధ్యయనోత్సవ వేదికపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. హారతి సమర్పించాక భక్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన సంగీత, నృత్య, కచేరి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆ తర్వాత స్వామివారు ఊరేగింపుగా తిరువీధి సేవకు వెళ్లారు. తాతగుడి వీధిలోని విశ్రాంత మండపం వద్దకు తీసుకెళ్లి కాసేపు ఉంచి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత తిరిగి గర్భగుడికి తీసుకొచ్చారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుని ప్రసాదం స్వీకరించారు.



స్టేడియంలో వేదికపై ఆశీనులైన స్వామివారు

నేటి అవతార విశిష్టత..

అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ చంద్రస్వామి గురువారం వరాహావతారంలో దర్శనమివ్వనున్నారు. ప్రజా సృష్టి చేద్దామనుకున్న స్వాయంభువుడితో పాటు బ్రహ్మాదుల మొర విన్న నారాయణుడు నీటిలో మునిగి ఉన్న భూమిని బయటకు తీయడానికి వరాహావతారాన్ని ధరించాడు. భూమిని తన కోరలతో పైకెత్తాడు. ఈ కార్యంలో ఆటంకం కలిగించిన లోకకంటకుడైన హిరణ్యాక్షుడు అనే రాక్షసుడిని సంహరించి భూమిని రక్షించాడు. రాహు గ్రహ బాధలున్న వారు ఈ అవతారంలో ఉన్న స్వామిని దర్శిస్తే విముక్తులవుతారని ప్రతీతి.

ప్రశాంతంగా 'నూతన' వేడుకలు

ఖమ్మంక్రైం: పోలీసుల భద్రతకు తోడు ప్రజల్లోనూ అవగాహన రావడంతో ఈసారి కొత్త సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం రాత్రి 9గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, అనవసరంగా ఎవరైనా రహదారులపైకి వస్తే చర్యలు ఉంటాయని పోలీసులు ముందస్తుగానే వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. అనుకున్నట్లుగానే మంగళవారం రాత్రి 10 గంటల నుంచే రహదారులపై గస్తీ పెంచడమే కాక డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు మొదలుపెట్టారు. దీంతో యువకులు రోడ్లపైకి రావడానికి జంకారు. చాలామంది ఇళ్లలోనే కుటుంబాలతో కలిసి నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవడంతో ప్రశాంత వాతావరణం నెలకొంది. కాగా, మంగళవారం అర్ధరాత్రి తర్వాత డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 50 మంది వరకు పట్టుబడ్డారని పోలీసులు వెల్లడించారు.

కమిషనరేట్‌లో..

కొత్త సంవత్సరంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజలంతా ఉత్సాహంగా ముందుకు సాగాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆకాంక్షించారు. కమిషనరేట్‌లో తనను కలిసిన అధికారులు, ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. పోలీస్ యంత్రాంగం కృషితో కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. కాగా, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతిపై సంతాప దినాలు పాటిస్తుండడంతో హడావుడి లేకుండా నూతన సంవత్సరం వేడుకలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, కుమారస్వామి, విజయబాబు, ట్రైయినీ ఐపీఎస్ రుత్విక్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో సందడి

పాల్వంచరూరల్ : నూతన సంవత్సరం సందర్భంగా పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో బుధవారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల పర్యాటకులు డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఈసందర్భంగా వైల్డ్‌లైఫ్ శాఖ, పర్యాటక అభివృద్ధి సంస్థకు రూ.70,340 ఆదాయం లభించింది.

మనుగడలోకి టీజీబీ..

తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా సేవలు ప్రారంభం



ఖమ్మం శ్రీనగర్ కాలనీ బ్రాంచ్ వద్ద ఏర్పాటుచేసిన బోర్డు

ఖమ్మంవ్యవసాయం: బ్యాంకుల విభజనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ)ను తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)గా మార్పు చేశారు. రాష్ట్రాల వారీగా గ్రామీణ బ్యాంకులను ఏర్పాటుచేసి జాతీయ స్థాయిలో నేషనల్ రూరల్ బ్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఏపీతో పాటు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో విస్తరించి ఉన్న ఏపీజీవీబీని సైతం విభజించారు. ఈమేరకు రెండు ఉమ్మడి జిల్లాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)గా మార్పుగా బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. 1976లో నాగార్జున గ్రామీణ బ్యాంకు(ఎన్‌జీబీ)గా ఏర్పడగా, ఈ బ్యాంకు 2006లో ఏపీజీవీబీ రూపాంతరం చెందింది. మళ్లీ ఇప్పుడు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో టీజీబీ ఇప్పటికే నిర్వహణలో ఉన్న నేపథ్యాన ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని ఏపీజీవీబీలను సైతం అదే బ్యాంకు పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఏపీజీవీబీ టీజీబీగా రూపాంతరం చెందిన నేపథ్యాన వరంగల్‌లో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని సైతం హైదరాబాద్‌కు మార్చనున్నారు. ఈనేపథ్యాన ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్రాంచ్‌లకు టీజీబీ పేరిట బోర్డులు ఏర్పాటుచేయగా బుధవారం నుంచి ఇదే పేరుతో సేవలు మొదలయ్యాయి.



ఖమ్మంలోని స్తంభాద్రి ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు

'కొత్త' పూజలు

జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి మొదలైన నూతన సంవత్సర వేడుకలు బుధవారం కూడా కొనసాగాయి. తెల్లవారుజామునే పలువురు ఆలయాలకు చేరుకుని బారులుదీరి పూజలు నిర్వహించారు. అలాగే, చర్చిల్లోనూ అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

క్లుప్తంగా

లేబర్‌కార్డుల ద్వారా ప్రయోజనాలు



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కార్మిక శాఖ అధికారి, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వం జారీ చేస్తున్న లేబర్‌కార్డుల ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన కార్పెంటర్ల అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పెంటర్‌గా పనిచేసే ప్రతీ ఒక్కరుకి లేబర్‌కార్డు తీసుకోవాలని, ఈక్రమాన దళారులను కాకుండా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను విడుదల చేశారు. కార్పొరేటర్ చాకమూరి వెంకటనారాయణ, కార్పెంటర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాణాల వీరబ్రహ్మాచారి, సోమ నాగరాజుకుమార్‌తో పాటు తాటికొండ రవీంద్రచారి పాల్గొన్నారు .

కేయూ నుంచి డాక్టరేట్



సునీత

రఘునాథపాలెం: మండలంలోని లచ్చిరాం తండాకు చెందిన మాలోతు సునీత కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తండాకు చెందిన మాలోతు బాబు - లీల దంపతుల కుమార్తె అయిన సునీత తన భర్త, ఉపాధ్యాయుడైన రాము సహకారంతో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధనాపత్రం సమర్పించారు. ప్రొఫెసర్ డి.సక్రియా పర్యవేక్షణలో 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ త్రూ మైక్రో ఫైనాన్స్- ఏ కేస్ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్' అంశంపై ఆమె పరిశోధన పూర్తి చేయగా డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా సునీతను గ్రామస్తులు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మధిర: మధిరలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. మమండలంలోని వంగవీడుకు చెందిన ఎస్.గోపాలకృష్ణ మోటార్ సైకిల్పై అంబేద్కర్ సెంటర్ నుంచి ఆర్‌ఓబీ మీదుగా వైఎస్సార్ చౌరస్తా వైపు వస్తున్నాడు. అదే సమయాన ఒక ఆటో వైఎస్సార్ చౌరస్తా నుంచి మహదేవపురం వెళ్తూ ఆర్‌ఓబీపై బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న గోపాలకృష్ణ, ఆటోలో ఉన్న గోపీకి గాయాలయ్యాయి. దీంతో వీరికి మధిర చికిత్స అందించాక మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. అలాగే, ఆత్కూరులో నరేష్ అనే వ్యక్తి వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను సైతం ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బైక్ పైనుంచి పడిన ఇద్దరికి...

నేలకొండపల్లి: బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు కింద పడిన ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కొత్త కొత్తూరుకు యోగీందర్, మనోజ్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నేలకొండపల్లి వచ్చి ఇంటికి తిరిగివెళ్తున్నారు. ఈక్రమాన కుక్క అడ్డు రాగా ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ప్రమాదవశాత్తు కింద పడగా గాయాలయ్యాయి. దీంతో ఇద్దరికి స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.


మూడు ఇళ్లలో చోరీలు

పెనుబల్లి: పెనుబల్లి మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత ముగ్గురి ఇళ్లలో చోరీలు జరిగాయి. స్థానిక బీసీ కాలనీకి చెందిన తేజావత్ బిక్కు ఇంట్లో చొరబడిన నిందితులు 22 గ్రాముల చెవిదిద్దులు, సూత్రాలు, మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన భుక్యా మురళి ఇంట్లో రూ.38 వేలు అపహరించారు. ఇక వీఎం బంజర్ పెట్రోల్ బంక్ పక్కనే నివాసముండే ధరావత్ వెంకటేశ్వరరావు ఇంట్లోనూ రెండు మొబైల్ ఫోన్లను దొంగిలించారు. బాధితులు గాఢనిద్రలో ఉన్న సమయాన ఈ చోరీలు జరిగినట్లు తెలుస్తుండగా, బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై కె.వెంకటేష్‌తో పాటు ఖమ్మం క్లూస్ టీం సిబ్బంది వారి ఇళ్లలో పరిశీలించి ఆధారాలు సేకరించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బొడ్డపాటి ఉపేంద్ర(25) ఓ ప్రైవేటు స్కూల్ బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక, కుటుంబ సమస్యలతో మనోవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించే సరికే మృతి చెందాడు. మృతుడికి తల్లి, సోదరుడు వెంకట రమణ ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

పునర్వైభవం సాధించేనా?



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

జిల్లా పెద్దాస్పత్రిలో నానాటికీ తగ్గుతున్న వైద్యసేవలు

- 2023, 2024 గణాంకాలు పరిశీలిస్తే తేడా
- ఓపీ, ఐపీ సేవలతో పాటు ప్రసవాల్లోనూ అదే పరిస్థితి
- డీఎంఈ పరిధిలోకి వెళ్లాక దిగజారిన సేవలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవల ముగిసిన 2024 సంవత్సరంలో వైద్యసేవలు తగ్గుముఖం పట్టాయి. 2023తో పోలిస్తే ఔట్ పేషంట్, ఇన్‌పేషంట్ సేవల్లో తగ్గుదల నమోదైంది. ఇక్కడ చికిత్స కోసం వచ్చే వారిపై సిబ్బంది నిర్లక్ష్యవైఖరి, అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండకపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. మరో కారణంగా తెలుస్తోంది.కాగా, సుమారు 60 ఏళ్ల క్రితం ఆస్పత్రిని నెలకొల్పగా క్రమక్రమంగా అభివృద్ధి సాధిస్తూ ప్రస్తుతం 500 పడకల స్థాయికి చేరింది. ఇక్కడ చికిత్స కోసం జిల్లా నలుమూలల నుండే కాకుండా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలతో పాటు ఏపీలోని పలు జిల్లాల ప్రజలు కూడా వస్తారు. నిత్యం జనరల్ ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రం ద్వారా 1,500 నుండి 2వేల మంది వరకు వైద్యసేవలు పొందుతుంటారు. ఇక సీజనల్ వ్యాధుల కాలంలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఆస్పత్రి కొంతకాలంగా వైద్య సేవల్లో వెనుకబడిపోతుండడం చర్చకు దారి తీస్తోంది.

అప్పటి నుంచే నీలినీడలు

2023 నవంబర్‌లో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వెళ్లింది. దీంతో వైద్యులను వివిధ ఏరియా ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. ఫలితంగా అనుభవజ్ఞులైన వైద్యులు లేకపోగా, ఉన్నవారు సైతం సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రత్యేక వైద్యనిపుణులు లేక ఆస్పత్రిలోని సీనియర్ రెసిడెంట్లతోనే ఓపీ(ఔట్ పేషంట్) సేవలు అందిస్తున్నారు. ఇక ఓపీలో చూపించుకుని అవసరమైన టెస్టులు చేయించుకుని వచ్చేలోగా వైద్యులు వెళ్లిపోతుండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అవస్థ పడుతున్నారు. దీనికి తోడు శస్త్ర చికిత్సలు కూడా నామమాత్రంగానే జరుగుతుండడంతో కొద్దోగొప్పో స్థోమత ఉన్న వారు ప్రైవేట్ బాట పడుతున్నారు. 2023లో జనవరి నుండి డిసెంబర్ వరకు 5,20,545 మంది ఓపీ సేవలు పొందగా, 63,454 మంది ఇన్‌పేషంట్లు(ఐపీ)గా చికిత్స చేయించుకున్నారు. కానీ 2024లో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. జనవరి నుండి డిసెంబర్ 27 వరకు పెద్దాస్పత్రిలో 4,12,240 మంది ఔట్ పేషంట్లు వైద్యం కోసం రాగా, 38,751 మంది మాత్రమే ఇన్‌పేషంట్లుగా సేవలు పొందినట్లుగణాంకాలు చెబుతున్నాయి. దీంతో పెద్దాస్పత్రిలో వైద్యసేవలు పొందటానికి చాలామంది విముఖత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

పెద్దాస్పత్రిలో 2024లో జనరల్ ఓపీ, ఐపీ సేవలు

నెల	ఓపీ	ఐపీ
జనవరి	37,059	3,145
ఫిబ్రవరి	31,842	2,521
మార్చి	33,014	2,580
ఏప్రిల్	28,457	2,787
మే	35,259	2,890
జూన్	32,854	2,554
జూలై	37,022	2,363
ఆగస్టు	34,416	3,005
సెప్టెంబర్	30,999	2,647
అక్టోబర్	30,093	2,141
నవంబర్	32,539	2,279
డిసెంబర్ (27వరకు)	48,686	9,839

ఎంసీహెచ్‌లోనూ అంతే...



పెద్దాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)కు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు ఉండేది. ఒక దశలో నెలకు వేయి ప్రసవాలు కూడా చేసి రికార్డు నెలకొల్పారు. అంతేకాకుండా చిన్నారుల వైద్యసేవల విషయంలోనూ తల్లిదండ్రులకు భరోసా ఉండేది. కానీ 2024లో పరిశీలిస్తే సేవలపై వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పలుమార్లు ఫిర్యాదులు వచ్చాయి. వైద్య విధాన పరిషత్‌కు చెందిన వైద్యులు వెళ్లిపోవడంతో డీఎంఈ నుండి వచ్చిన గైనిక్ వైద్యులు సరిగా విధులు నిర్వర్తించడం లేదని, ఒకరిద్దరు మినహా ప్రసవాలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇదంతా పర్యవేక్షణ లేమితోనే జరుగుతున్నట్లు చెబుతున్నారు. కారణాలు ఏమైనప్పటికీ 2023లో 7,823 ప్రసవాలు జరగగా, 2024లో డిసెంబర్ 27వరకు 6,199 ప్రసవాలే చేయడం గమనార్హం.

రుణం పేరిట మోసం చేశాడని నిరసన

తల్లాడ: ఇంటిని తనఖా పెట్టి రుణం ఇప్పిస్తానన్న ఓ వ్యక్తి ఆ ఇంటిని ఆయనకు రాసిచ్చినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ఇప్పుడు మోసం చేశాడని ఆరోపిస్తూ ఓ మహిళ నిరసనకు దిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తల్లాడకు చెందిన బజారు మంగతాయి భర్త అనారోగ్యంతో మృతి చెందగా కొన్నేళ్లుగా హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తోంది. ఆమెకు మానసికంగా ఆరోగ్యం సరిగా లేని ఓ కుమారుడు ఉన్నాడు. ఈక్రమాన తల్లాడలో మెకానిక్‌గా పనిచేస్తున్న బిల్లుపాడుకు చెందిన గుంజి గురవయ్య తరచూ ఆమె హోటల్‌కు వస్తూ పరిచయం పెంచుకున్నాడు. ఆపై రుణం ఇప్పిస్తానని చెప్పగా ఆమె 2021 జనవరిలో ఇంటి కాగితాలు ఇచ్చింది. ఆతర్వాత ఆమెను నమ్మించి ఇంటిని గురవయ్య తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాక ఆ పత్రాలను బ్యాంక్‌లో పెట్టి రూ.20 లక్షల రుణం తీసుకున్నాడు. ఆ తర్వాత రుణం చెల్లించకపోవడంతో బ్యాంకు నుంచి ఆమెకు నోటీసులు వచ్చాయి. దీంతో గురవయ్యపై మంగతాయి రెండు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈమేరకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ ఆమె గురవయ్య ఇంటి ఎదుట తన కుమారుడితో బుధవారం నిరసన తెలిపారు. ఆమెకు వివిధ సంఘాల నాయకులు కోడెం సీతాకుమారి, కదురుపాక నిర్మల, ధనమ్మ, లక్ష్మి, రంగారావు, వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. ఈ విషయమై తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావును వివరణ కోరగా గురవయ్య మోసం చేశాడని మంగతాయి ఫిరయదు చేయగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి



సాయికుమార్ (ఫైల్)

ఖమ్మంక్రైం: నగరంలోని ఐటీ హబ్‌లో పని చేస్తున్న ఉద్యోగి నూతన సంవత్సరం రోజునే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడుకు చెందిన తుపాకుల సాయికుమార్(24) ఐటీ హబ్‌లో ఉద్యోగం చేస్తూ మామిళ్లగూడెంలోని తన సోదరుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. మంగళవారం రాత్రి విధులకు వెళ్లిన సాయికుమార్.. బుధవారం ఇంటికి తిరిగి వస్తుండగా వీడీఓస్ కాలనీలో బైక్‌ను విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు ప్రమాద స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీ రుగా విలపించారు. నూతన సంవత్సరం రోజే దుర్ఘటన జరగడంతో తెట్టెలపాడులో విషాదం నెలకొంది. అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరావు సాయంతో మృతదేహన్ని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ప్రమాదంలో మెకానిక్..



ఘటనా స్థలంలో పాషా మృతదేహం

కూసుమంచి : మండలంలోని చింతలతండా సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ మెకానిక్ షేక్ జాన్‌పాషా(35) మృతిచెందాడు. మృతుడి స్వగ్రామం మండలంలోని పెరికసింగారం కాగా, కూసుమంచిలో నివాసం ఉంటూ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. పాషా వద్ద చేగొమ్మకు చెందిన రాము అనే వ్యక్తి పనిచేస్తుండగా అర్ధరాత్రి సమయంలో అతడిని ఇంటి వద్ద దించి వస్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం ఉదయం పొలంలో పాషా మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. జాన్‌పాషా భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంగదేవిపాడు వద్ద ఒకరు..



అశోక్ (ఫైల్)

పెనుబల్లి: పెనుబల్లి మండలం గంగదేవిపాడు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తాళ్లపెంటకు చెందిన మిడియం అశోక్ (26) మంగళవారం రాత్రి పెనుబల్లి వైపు బైక్‌పై వెళ్తుండగా పెనుబల్లి నుండి గంగదేవిపాడు వెళ్తున్న జడల కిరణ్ ద్విచక్రవాహనం ఎదురుగా ఢీకొట్టడంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనకు ఖమ్మం చికిత్స చేయించి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈమేరకు ఆయన కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతదేహంతో గంగదేవిపాడులోని జడల కిరణ్ ఇంటి ముందు బంధువులు ఆందోళన చేపట్టారు. వీం.బంజర్ ఎస్సై కె.వెంకటేష్ చేరుకుని వారికి నచ్చచెప్పి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

వేడి నూనె పోయడంతో గాయపడిన వృద్ధుడు..

కారేపల్లి: తరచుగా బయటకు ఎందుకు వెళ్తున్నావని మందలించిన మామపై కోడలు కక్ష పెంచుకొని వేడి నూనె పోయగా తీవ్రగాయాల పాలైన ఆయన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కారేపల్లి మండలం ఫైల్‌తండా గ్రామానికి చెందిన అజ్మీరా బాబు(60) తన కోడలు ఉమను అస్తమానం బయట తిరగొద్దని మందలించగా ఆమె గతనెల 28న నిద్రిస్తున్న బాబుపై సలసల కాగే నూనె పోసింది. దీంతో ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం పరిస్థితి విషమించి కన్నుమూశాడు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో ఉమపై కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి...

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కల్లూరు మండలం ముగ్గు వెంకటాపురానికి చెందిన నరేంద్ర(19) మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై పెనుబల్లి మండలం ఎల్ఎస్ బంజర్ నుండి శంభునిగూడెం వెళ్తున్నాడు. గ్రామం దాటాక మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న బోర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ ఎస్సై తెలిపారు.

జమిలి ఎన్నికల కోసం ప్రజల ఎదురుచూపులు

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: జమిలి ఎన్నికలు వస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ప్రజలు ఎదురుచూస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిందేమీ లేకపోగా, హామీలను తుంగలో తొక్కి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రైతులు, మహిళలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, చంద్రావతి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, నాయకులు గుండాల కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, వీరునాయక్ పాల్గొన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

ఖమ్మం మామిళ్లగూడెం: భూభారతి చట్టం ద్వారా రాష్ట్రంలోని భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఖమ్మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన బుధవారం భూభారతి చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ధరణితో పోలిస్తే మెరుగైనదని చెబుతున్న కొత్త చట్టం ద్వారా మొత్తం భూసమస్యలు పరిష్కారం కాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈమేరకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమగ్ర భూసర్వే చేపట్టి పోడు సాగుదారులకు కూడా పాస్‌పుస్తకం, భూ ఆధార్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో వివిధ సంఘాల నాయకులు కొండపర్తి గోవిందరావు, మలీదు నాగేశ్వరరావు, వై.ప్రకాష్, తాతా భాస్కర్‌రావు, బండి పద్మ, ఎం.సుబ్బారావు, ఎం.సత్యనారాయణ, నందిపాటి మనోహర్, బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, వై.శ్రీనివాసరావు, నవీన్‌రెడ్డి, మల్లయ్య, మోహన్‌రావు, ప్రవీణ్, బషీర్ పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లి గోపవరంలో కొనసాగుతున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్ఐ పి.వెంకటేష్‌తో పాటు సిబ్బంది తనిఖీలు చేపట్టగా పది మంది కోడిపందెం రాయళ్ల పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు కోడిపుంజులు, రూ.4,200 నగదు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట : మండల పరిధిలోని ఎర్రన్నపేట గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్సై సాయి కిషోర్ రెడ్డి కథనం ప్రకారం... ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10,590 నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు

- 100 మందికి పైగా క్రీడాకారుల హాజరు
- విజేతల వివరాలు వెల్లడించిన అధికారులు



మహిళల విభాగంలోవిజేతలు..

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఆర్చరీ పోటీలు బుధవారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 100 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఓపెన్ విభాగంలో ఇండియన్ రౌండ్, కాంపౌండ్ రౌండ్, రికర్వ్ అంశాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈమేరకు విజేతల వివరాలను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకరయ్య వెల్లడించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాంబాబు, పుల్లారెడ్డి, జాతీయ ఆర్చరీ కోచ్ రవిశంకర్‌తో పాటు నగేష్, మారెప్ప, బొజ్జి, కె.నర్సింహామూర్తి, మతిన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో కె.లక్ష్మణ్(మహబూబాబాద్), ఆర్.రవి(మహబూబ్‌నగర్), జి.రిత్విక్(ములుగు), మహిళల విభాగంలో రిఫీజా(వరంగల్), సీహెచ్.రష్మిత(సిద్దిపేట), వి.ప్రవంతి(మేడ్చల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అలాగే, కాంపౌండ్ రౌండ్ పురుషుల విభాగంలో బి.రాహుల్(నిజామాబాద్), వి.శివసాయి(భద్రాద్రి కొత్తగూడెం), కె.సాయిసుష్మంత్, మహిళల విభాగంలో ఎం.శిరీషారెడ్డి(రంగారెడ్డి), ఆర్.సుజాత(మహబూబాబాద్), మున్సుహరా హసీంబీ(వరంగల్), రికర్వ్ అంశం పురుషుల విభాగంలో సముద్రాల అఖిల్(మహబూబాబాద్), కోటా అచ్యుత్(వరంగల్), కె.హర్షవర్ధన్(హైదరాబాద్), మహిళల విభాగంలో టి.చిన్మయి(హైదరాబాద్), కె.లోహిత్‌శ్రీ(భద్రాద్రి కొత్తగూడెం), కె.సింధూజ(కామరెడ్డి) మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.



పురుషుల విభాగంలో విజేతలతో డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

మంత్రులను కలిసిన అధికారులు, నాయకులు



మంత్రి తుమ్మలతో టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు అధికారులు కలిశారు. ఈ సందర్భంగా టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ బాధ్యులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, బాలకృష్ణ, దుర్గాప్రసాద్, జైపాల్, శ్రీధర్ సింగ్, ఎర్ర రమేష్, ఆంజనేయులు, శ్రీకాంత్, రాధాకృష్ణ, హరికృష్ణ మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఏసీపీ రమణమూర్తి, సీఐలతో డీఎంహెచ్ఓ కళావతిబాయి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ కూడా మంత్రిని కలిశారు. అంతేకాకుండా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, పొదిల్ల రవికుమార్, సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, నాంపల్లి శంకరయ్య, నల్లమల వెంకటేశ్వరరావు, అల్లం శ్రీనివాసరెడ్డి తదితరులు కూడా మంత్రిని కలిశారు. అలాగే, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కాంగ్రెస్ నాయకుడు బొర్రా రాజశేఖర్ తదితరులు హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- జమలాపురం ఆలయంలో వేలాదిగా బారులు
- ఆర్జిత సేవల ద్వారా ఒకేరోజు రూ.5.10లక్షల ఆదాయం



క్యూలైన్‌లో దర్శనానికి వేచి ఉన్న భక్తజనం

ఎర్రుపాలెం: కొత్త సంవత్సరంలో తొలిరోజైన బుధవారం తెలంగాణ తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీవారి దర్శనానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన భక్తులు పోటెత్తారు. భక్తుల రాకకు అనుగుణంగా అధికారులు ముందుగానే బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈనేపథ్యాన ఉదయం 4గంటలకే స్వామికి నిత్యార్చనలు నిర్వహించగా 5-30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 25వేల మందికి పైగా భక్తులు దర్శించుకోగా జమలాపురానికి చెందిన తుళ్లూరు కోటేశ్వరరావు-నిర్మల దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు. కాగా, లడ్డూల అమ్మకం, తలనీలాలు, వాహన పూజ టికెట్లు తదితర ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి ఒకేరోజు రూ.5.10 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించగా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. అలాగే, శ్రీసత్యసాయి సేవా సమితి, జమలాపురానికి చెందిన భక్తులు సేవలందించారు.



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు